క్లుప్తంగా

పండ్ల తోటల పెంపకానికి చర్యలు తీసుకోండి



రొద్దం సమీపంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీడీ లక్ష్మీనారాయణ

రొద్దం: ఉపాధి హామీ పనుల కింద పండ్లతోటల పెంపకం చేపట్టనున్నట్లు ఏపీడీ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సమీక్ష నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ ఆసక్తి ఉన్న రైతులు ఉద్యాన అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు. ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ పండ్ల తోటల పెంపకంపై చర్యలు తీసుకోవాలన్నారు. కూలీల సమస్యలను, పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేశవరెడ్డి, ఏపీఓ అనిల్‌కుమార్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

లేపాక్షి: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమై జూన్ 3న ముగుస్తాయని ఎంఈఓ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లేపాక్షిలోని పూలే గురుకుల పాఠశాలలో నిర్వహించే పరీక్షలకు 290 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం: హిందూపురం పట్టణ సబ్ డివిజన్ ముదిరెడ్డిపల్లి సెక్షన్ రాచపల్లి సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈఈ మహేష్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాచపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని చలివెందుల, మీనకుంటపల్లి, రాచపల్లి ,బాలంపల్లి, జంగాలపల్లి, చర్లపల్లి, పత్తికొండపల్లి, వెలగడకల, తుంగోడు, కొలతట్టుపల్లి, కొలంపల్లి, కావేటి నాగేపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ లైన్లు మరమ్మత్తులు కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలన్నారు.

కాంగ్రెస్ నేత కన్నుమూత



వెంకటరెడ్డి (ఫైల్)

పావగడ: వెంకటాపురం పంచాయతీ శ్రీనివాసపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత వెంకటరెడ్డి(75) గుండెపోటుతో గురువారం ఉదయం స్వగృహం లో మృతి చెందాడు. మృతుడు వెంకటరెడ్డి గతంలో స్థానిక మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడిగా, వెంకటాపురం వీఎస్ఎస్ఎన్ డైరెక్టర్‌గా పని చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మాజీ మంత్రి వెంకటరమణప్ప వెంకటరెడ్డి భౌతిక కాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. తాలూకా రూరల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామాంజినప్ప, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు టీ ఎస్ నరసింహయ్య, నాయకులు అక్కంపల్లి ఆదినారాయణ, విశ్వేశ్వరయ్య, గుమ్మఘట్ట శ్రీనివాసులు, విజయకుమార్‌రెడ్డి, ఏ. శంకరరెడ్డి, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం టౌన్: 2023–24లో 10వ తరగతి, ఇంటర్‌మీడియట్ రెండో సంవత్సరంలో మంచి ప్రతిభ కనబరిచిన వాల్మీకి విద్యార్థుల నుంచి ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వాల్మీకి ఉద్యోగుల సంఘం నాయకులు గురువారం తెలిపారు. హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు, పరిగి మండలాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్కుల జాబితాతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, టీసీ జిరాక్స్‌ను జూన్ 5లోపు 9441665692, 7780583140 నంబర్లకు వాట్సప్ ద్వారా పంపాలని వారు సూచించారు.

విత్తన వేరుశనగ పంపిణీ



విత్తన కాయలను పంపిణీ చేస్తున్న అధికారులు

పావగడ: స్థానిక మార్కెట్ యార్డులో వేరుశనగ విత్తనకాయలను జేడీఏ రమేశ్ గురువారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాలూకా వ్యాప్తంగా 6 ప్రాంతాలలో విత్తన కాయ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే 135 క్వింటాళ్ల విత్తన కాయ ను గోదాముల్లో సిద్ధం చేశామని త్వరలోనే మరో 400 క్వింటాళ్లకు పైగా విత్త తాలూకా వ్యాప్తంగా 5641 మంది రైతుల ఖాతాల్లో కరువు పరిహారం ప్రభుత్వం జమ చేసిందన్నారు. డీడీఏ చంద్రశేఖర్, ఈఓ జానకిరాం , స్థానిక ఏడీఏ అజయ్ కుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగకు డిమాండ్

- విత్తనం కోసం 5,555 మంది రైతుల రిజిస్ట్రేషన్
- 4,733.10 క్వింటాళ్లకు నమోదు

వేరుశనగ విత్తనం కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల వివరాలు

మండలం	రైతుల సంఖ్య	విత్తనం (క్వింటాళ్లలో)
మడకశిర	1,645	1,364.70
అమరాపురం	1,123	987
గుడిబండ	1,910	1,634.70
రొళ్ల	573	488.10
అగళి	304	258.60
మొత్తం	5,555	4,733.1



విత్తనం కోసం పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు



విత్తన కాయల నాణ్యతను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

మడకశిర: వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో వేరుశనగ విత్తన కాయలకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయడానికి రైతులు విత్తన వేరుశనగ కాయల కోసం తమ పేర్లను పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ఐదు రోజుల నుంచి విత్తనం కోసం వ్యవసాయశాఖ అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు. ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లోనే రైతుల తమ పేర్లను నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో రైతులు ఆర్బీకేలకు వెళ్లి విత్తనం కోసం పేర్లను నమోదు చేసుకుంటున్నారు.

ముంగారు వర్షాలతో రైతుల్లో ఉత్సాహం..

ముంగారు వర్షాలతో రైతుల్లో పంటల సాగుపై ఉత్సాహం నెలకొంది. ఇటీవల నియోజకవర్గ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురవడంతో రైతులు ముమ్మరంగా సేద్యపు పనులు చేస్తున్నారు. మరోవైపు విత్తనకాయలు సేకరించడంలో నిమగ్నమయ్యారు. ఫలితంగా విత్తన వేరుశనగకు భారీ డిమాండ్ ఏర్పడింది. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ విత్తనం కోసం 5,555 మంది రైతులు 4,733.10 క్వింటాళ్ల వేరుశనగ విత్తనం కోసం పేర్లు నమోదు చేసుకున్నారు.

రైతుల సంఖ్య పెరిగే అవకాశం..

వేరుశనగ సాగు చేసే రైతుల సంఖ్య భారీగా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇంకా విత్తనం కోసం పేర్లు నమోదు చేసుకునే ప్రక్రియ కొన్ని రోజుల పాటు కొనసాగనుంది. మడకశిర మండలంలో 1,364. 70 క్వింటాళ్ల విత్తనానికి 1,645 మంది, అమరాపురం 987 క్వింటాళ్లకు 1,123, గుడిబండ 1,634.70 క్వింటాళ్లకు 1,910, రొళ్ల 488.10 క్వింటాళ్లకు 573, అగళి మండలంలో 258.60 క్వింటాళ్లకు 304 మంది చొప్పున రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు ఏడీఈ కృష్ణమీనన్ తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న రైతులకు వేరుశనగ విత్తనకాయలను త్వరలోనే అందిస్తామని పేర్కొన్నారు. డిమాండ్ మేరకు రైతులకు విత్తన కాయలను అందిస్తామని, రైతులు ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

గండిహళ్లి దత్తాత్రేయ మఠాన్ని దర్శించుకున్న ఈరలక్కప్ప



కుటుంబ సభ్యులతో కలిసి మఠంలో ఉన్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

గుడిబండ: కర్ణాటకలోని గండిహళ్లి దత్తాత్రేయ మఠాన్ని గురువారం రాత్రి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. దత్తాత్రేయ మఠాన్ని దర్శించుకున్న ఈరలక్కప్ప పసుపు, కుంకుమ, బెల్లం, కొబ్బరికాయలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పూజారులు ఈరలక్కప్పకు కండువాలు కప్పి తీర్థ, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జీబీ కరుణాకర్, నాయకులు యువరాజు, నాగు, బోజరాజు, నాగరాజు, బండయ్య, దేవరాజు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఈరలక్కప్పకు సన్మానం



ఈరలక్కప్ప సన్మానిస్తున్న దళిత యువకులు

గుడిబండ: రాళ్లపల్లి గ్రామానికి చెందిన దళిత యువకులు ఎంపీటీసీ సభ్యుడు సురేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ రానున్నది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని దళిత సోదరులకు భరోసా కల్పించారు. నాయకులు నరసింహరాజు, మంజునాథ్, దళిత నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి ప్రథమ వార్షికోత్సవం



రొద్దంలో గ్రామ సంకీర్తనలు చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది ఒడ్డున నూతనంగా నిర్మించిన భజన మందిరంలో సత్యసాయి ప్రథమ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం గ్రామ సంకీర్తనలు, జ్యోతి ప్రజ్వలన, పతాకావిష్కరణ, గ్రంథాలయం ప్రారంభోత్సవం చేశారు. అనంతరం వేదపఠనం, సత్సంగ సమావేశం నిర్వహించారు.

రెండు టిప్పర్లు పట్టివేత

సోమందేపల్లి : మండలంలోని వెలుగమాకులపల్లి వద్ద జాతీయ రహదారిపై కంకర తరలిస్తున్న రెండు టిప్పర్లను విజిలెన్స్ అధికారులు గురువారం పట్టుకున్నారు. పరిమితికి మించి లోడు ఉండటంతో అనంతపురం విజిలెన్స్ అధికారులు వాహనాలను సీజ్ చేశారు.

ఆధ్యాత్మిక సేవలపై సూచనలు

పెనుకొండ: ఆధ్యాత్మిక సేవలపై సత్యసాయి జిల్లా సత్యసాయి భజన మండలి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి వివరించారు. గురువారం పట్టణంలో ఆయన సత్యసాయి భజన మండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రత్యేక భజనల అనంతరం ఆయన ఆధ్యాత్మిక సేవలపై పలు సూచనలు సలహాలు అందించారు.

9,002 పాఠ్య పుస్తకాలు

పెనుకొండ: మండల కేంద్రానికి 9,002 పాఠ్య పుస్తకాలు చేరినట్లు డిప్యూటీ డీఈఓ రంగస్వామి గురువారం తెలిపారు. పట్టణంలోని పుస్తకాల స్టాక్ పాయింట్‌ను ఆయన సందర్శించారు. ఎంఈఓ సుధాకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పందుల అపహరణ

రొళ్ల: మండల కేంద్రంలోని చెరువు వెనక భాగం మరువ సమీపాన నివాసం ఉంటున్న గోపాలప్ప గారి రామలక్ష్మమ్మ చెందిన 12 పెంపుడు పందులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. బాధితురాలి వివరాల మేరకు.. రోజు మాదిరిగానే పందులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొట్టంలో వదిలారు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు వాటిని ఎత్తుకెళ్లారు. వారం రోజుల క్రితం కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపురం చెందిన కొందరు వ్యాపారులు పందులను బేరామాడారని, వారే ఎత్తుకెళ్లి ఉంటారని ఆమె అనుమానం వ్యక్తం చేసింది. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పొగాకు ఉత్పత్తుల వినియోగంతో ప్రాణాపాయం



పరిగిలో టీకా వేస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూపరెడ్డి



రొద్దంలో వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పరిగి: పొగాకు ఉత్పత్తుల వినియోగంతో పాటు మత్తు పదార్థాలకు అలవాటుపడితే ప్రాణాపాయం తప్పదని మెడికల్ ఆఫీసర్లు స్వరూపరెడ్డి, నవీన తెలిపారు. గురువారం మండలంలో బీసీజీ టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్లు మాట్లాడుతూ క్షయ వ్యాధి సాధారణంగా పొగాకు ఉత్పత్తుల వాడకంతో వస్తుందన్నారు. దీని వల్ల కుటుంబానికే ప్రమాదకరంగా మారుతుందన్నారు. మండలంలో 428 మందికి క్షయ వ్యాధి నివారణకు బీసీజీ టీకాలను వేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వన్నప్ప, వెంకమ్మ, రవీంద్ర, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు వ్యాక్సిన్ వేయించుకోవాలి

రొద్దం: వయోవృద్ధులు బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల వ్యాప్తంగా క్షయనివారణ వ్యాక్సిన్ కార్యక్రమం చేపట్టారు. డాక్టర్ మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన వారు వ్యాక్సిన్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ జీసీటీ వ్యాక్సిన్

పెనుకొండ: క్షయవ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా ప్రతి ఒక్కరూ జీసీటీ వ్యాక్సిన్ వేయించుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ నివేదిత పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో ఆమె జీసీటీ వ్యాక్సిన్‌పై వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీసీటీ వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ క్షయ నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ఇబ్బంది ఎదురవుతుందన్నారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు



రాజకీయ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఈరన్న

పరిగి: వచ్చే జూన్ నెల 4న ఎన్నికల కౌంటింగ్ జరిగే రోజున గ్రామాల్లో గొడవలు సృష్టించేవారు, గొడవల్లో పాల్గొనేవారు, గొడవలకు కారణమైన వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేదిలేదని పెనుకొండ సీఐ యుగంధర్ హెచ్చరించారు. గురువారం మండలంలోని బీచిగానిపల్లిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. వేకువజామునే గ్రామానికి చేరుకున్న పోలీసులు.. అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లతో పాటు గతంలో నేరాలకు పాల్పడిన, ముద్దాయిల ఇళ్లను పరిశీలించారు. ప్రధానంగా వేట కొడవళ్లు, కత్తులు వంటి మారణాయుధాలతో పాటు కర్ణాటక మద్యం నిల్వలపై ఇళ్ల పరిసరాలు, పొలాలు, అనుమానాస్పద ప్రదేశాల్లో దాడులు చేశారు. సీఐ యుగంధర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించరాదన్నారు. కార్డెన్ సెర్చ్ కార్యక్రమంలో 5 పదునైన వేట కొడవళ్లతో పాటు లైసెన్స్‌లు, రికార్డులు లేని 6 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో పరిగి, రొద్దం, పెనుకొండ ఎస్ఐలు సత్యనారాయణ, వలీబాషా, రాజేష్, పెనుకొండ సర్కిల్ పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకులతో సమావేశం

లేపాక్షి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో హిందూపురం రూరల్ సీఐ ఈరన్న ఆధ్వర్యంలో మండలవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులతో గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ జూన్ 4న కౌంటింగ్ పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. అప్పటి వరకూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని పార్టీల నాయకులు సమన్వయంతో ఉండాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపి, పోలీసులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

గొడవలకు దిగితే కఠిన చర్యలు

గుడిబండ: ఓట్ల లెక్కింపు తర్వాత ఎవరైనా గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మునిప్రతాప్ హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందు జాగ్రత్తగా వివిధ పార్టీలకు చెందిన 12 మందిని తహసీల్దార్ ఎదుట గురువారం బైండవర్ చేశామన్నారు. గ్రామాల్లో లూజుగా పెట్రోల్, డీజల్ అమ్మడం నిషిద్ధమన్నారు.



పరిగి: రికార్డులు లేని వాహనాలను సీజ్ చేస్తున్న పోలీసులు



గుడిబండ: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మునిప్రతాప్

ఘనంగా లక్ష్మీరంగనాథస్వామి రథోత్సవం



పేలుబండలో రథాన్ని లాగుతున్న భక్తులు

అమరాపురం: పేలుబండ కొండ పైన వెలసిన లక్ష్మీ రంగనాథస్వామి రథోత్సవాన్ని భక్తులు ఘనంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి అర్చకులు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. సాయంకాలం స్వామి ఉత్సవ విగ్రహాన్ని కొండ పైనుంచి పూజల అనంతరం భక్తులు మోసుకుంటూ రథం వద్దకు తీసుకొచ్చారు. పూజల అనంతరం రథంలో కూర్చొబెట్టి భక్తులు రథాన్ని లాగారు. ఈ సందర్భంగా బెల్లం, బొరుగులు, అరటి పండ్లు, పూలు తదితర వాటిని రథంపైకి విసిరి మొక్కులు చెల్లించారు. అనంతరం వచ్చిన భక్తులకు శిర, పేలుబండ గ్రామస్తులు అన్నదానం చేశారు.



పేలుబండ కొండ పైనుంచి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

వసతి నిలయాన్ని సద్వినియోగం చేసుకోండి

పావగడ: ఉచిత వసతి నిలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక కమ్మ చారిటబల్ ట్రస్ట్ కార్యదర్శి డా జి వెంకట్రామయ్య విద్యార్థులను కోరారు. నారాయణమ్మ, డీటీ హనుమంతరాయప్ప స్మారక కమ్మ బాలుర ఉచిత హాస్టల్ , సాకమ్మ, గంగినేని రామయ్య స్మారక కమ్మ బాలికల ఉచిత హాస్టల్ ప్రవేశానికి 2024–25కు సంబంధించి దరఖాస్తులు అందించాలని సూచించారు. పట్టణంలో పది, పీయూసీ చదువుతున్న తాలూకాలోని కమ్మ విద్యార్థులకు మెరిట్ ఆధారంగా హాస్టల్ సీట్లు కేటాయిస్తామన్నారు. అలాగే 80 శాతం పైగా మార్కులు సాధించిన ఇతర వెనుకబడిన సామాజికవర్గాల విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతిని కల్పిస్తామన్నారు. జూన్ 10 లోగా విద్యార్థులు తమ దరఖాస్తులను అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో అందించాలని కోరారు. వివరాలకు హాస్టల్ వార్డెన్ ఎన్ చంద్రశేఖర్(9449738630)ను సంప్రదించాలన్నారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



భక్తులతో కిటకిటలాడుతున్న ప్రధానరహదారి



గాజుల కొనుగోలులో నిమగ్నమైన మహిళలు

ధర్మవరం అర్బన్: పట్టణంలో దుర్గమ్మ పరుషలో భాగంగా గురువారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ సమీపంలోని రోడ్లన్నీ రద్దీగా మారాయి. గాజులు, బొమ్మలు, ఇంటి సామగ్రి, ఇంటి అలంకరణకు ఉపయోగపడే పూలు, ఇతరత్రా వస్తువుల దుకాణాలు ప్రజలతో కిటకిటలాడాయి.

వైభవంగా రంగనాథస్వామి బ్రహ్మరథోత్సవం



రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



రథాన్ని లాగుతున్న భక్తులు

రొళ్ల: కాల్వేపల్లిలో రంగనాథస్వామి బ్రహ్మరథోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఏటా వైశాఖ మాసంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా వేకువజామున స్వామివారి మూల విగ్రహాన్ని గంగాజలంతో అభిషేకించారు. తొలుత స్వామివారి మూల విగ్రహానికి భక్తులు కానుక రూపంలో తీసుకువచ్చిన పట్టువస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలతో పాటు పూలతో అలంకరణ చేసి మహామంగళారతి ఇచ్చారు. తర్వాత స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పూలతో అలంకరించి ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం రథంలోకి ఉత్సవ విగ్రహాన్ని నియమనిష్టలతో కూర్చోబెట్టారు. రథం ముందు భాగాన బలిహరణ, హోమంతో పాటు విశేష పూజలు చేశారు. తర్వాత చుట్టు పక్కల గ్రామాలతో పాటు స్వామివారిని కొలిచే భక్తులు, కమిటీ సభ్యులు రథాన్ని ఆలయం ప్రాంగణం నుంచి సమీపం వరకు తాడుతో లాగారు. భక్తులు రథంపైకి బొరుగులు, తమల పాకుతో పాటు అరటి పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ డాక్టర్ శివప్రసాద్ తదితరులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ తరఫున డాక్టర్ శివప్రసాద్‌కు పూలమాల వేసి శాలువ కప్పి సన్మానించారు. బ్రహ్మరథోత్సవంలో పాల్గొన్నా భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాద అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

నేడు 101 ప్రసాద వితరణ..

రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వసంతోత్సవం, 101 ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.